సాక్షి
నల్లగొండ
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



రేపే స్వర్ణ గోపురం ఆవిష్కరణ
యాదగిరిగుట్ట నృసింహుడి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురాన్ని ఈనెల 23న సీఎం ఆవిష్కరించనున్నారు. - 8లో



ఢీకొట్టిన కంటైనర్
మిర్యాలగూడలోని నందిపాడు రోడ్డులో అతివేగంగా వెళ్తున్న కంటైనర్ వరుసగా వాహనాలను ఢీ కొట్టింది. - 8లో



దొంగల బీభత్సం
నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు, మిర్యాలగూడలో శుక్రవారం దొంగలు బీభత్సం సృష్టించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు డిండిలో ‘మీట్ యువర్ ఎస్పీ’

నల్లగొండ : సమస్యలను ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించే దిశగా శనివారం ఉదయం 11 గంటలకు జిల్లాలోని డిండి పోలీస్‌స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుల ఫిర్యాదులను పోలీస్‌స్టేషన్లలోనే పరిశీలించి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు వారి సమస్యలపై తనను స్వయంగా కలిసి దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.

పశుసంవర్ధక శాఖ జేడీ బాధ్యతలు స్వీకరణ

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ జీవీ రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై నల్లగొండకు వచ్చారు. అనంతరం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో ఏడీహెచ్‌లు డాక్టర్ ఖాద్రి, డాక్టర్ వెంకటిరెడ్డి, డాక్టర్ విశ్వేశ్వర్‌రావు ఉన్నారు.

12 మంది ఎంపీఓలకు షోకాజ్ నోటీసు

నల్లగొండ : జిల్లాలోని 12 మంది మండల పంచాయతీ అధికారులకు శుక్రవారం డీపీఓ వెంకయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్నా.. పన్నులు ఎందుకు వసూలు చేయలేకపోయారని నోటీసులో పేర్కొన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి పన్నులు వసూలు చేయించడంలో వెనుకంజలో ఉన్న కారణంగా 12 మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వెంటనే పన్ను బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

నల్లగొండ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల మంజూరుకు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల ఉప సంచాలకుడు వి.కోటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఎన్నిక


కార్యదర్శి శంకర్


అధ్యక్షుడు నరేష్

నల్లగొండ టౌన్ : ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీని నల్లగొండలో నిర్వహించి జిల్లా మహాసభలో ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ తెలిపారు. శుక్రవారం నిర్వహించి సమావేశంలో వారు మాట్లాడుతూ 28 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నామన్నారు. ఈ మహాసభల్లో విద్యా వ్యవస్థలో ఉన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన పోరాట కార్యాచరణ రూపొందించామన్నారు.


బ్యాంకు ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

వేతన సవరణ అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : వేతన సవరణ ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం నల్లగొండలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయు) జిల్లా కన్వీనర్ కత్తుల ఈశ్వర్‌కుమార్, కార్యదర్శి క్రామిక్ మాట్లాడుతూ వేతన సవరణ అమలు చేయాలని.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు సుమన్, శ్రవణ్, ప్రవీణ్, వెంకట్‌రామ్, యాదయ్య, స్వాతి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం



నల్లగొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తయిందని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామని తెలిపారు. నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి గోదాం వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో 518 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

రుణమాఫీ.. కాదాయే!

- రూ.2 లక్షల వ్యవసాయ రుణమాఫీ కోసం రైతుల ఎదురుచూపు
- వివిధ కారణాలతో ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షమంది రైతులకు అందని మాఫీ
- ప్రభుత్వం నుంచి వెలువడని ప్రకటన.. ఆందోళనలో రైతులు
- హైదరాబాద్‌లోని గాంధీభవన్ మెట్లపై కూర్చొని శాలిగౌరారం రైతు నిరసన

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తన పంట రుణం రూ.3 లక్షలకు ఉందని.. ప్రభుత్వం తన రుణాన్ని మాఫీ చేయలేదని, రుణమాఫీ చేయించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని శాలిగౌరారం మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన రైతు తోట యాదగిరి శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ మెట్ల వద్ద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, జిల్లా కలెక్టర్ ద్వారా తన రుణాన్ని మాఫీ చేయించేందుకు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. పైగా తమకు ఎలాంటి ఫించన్ రాలేదని, ధాన్యం బోనస్ కూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆవేదన రైతు తోట యాదగిరి ఒక్కరిదే కాదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.2 లక్షల రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న దాదాపు లక్ష మంది రైతులదీ అదే పరిస్థితి.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీని ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. వివిధ కారణాలతో రూ.లక్షలోపు రుణమాఫీ కాని రైతులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 35 వేల మంది వరకు ఉండగా, రూ.2 లక్షలు, ఆపై రుణాలు కలిగిన రైతులు దాదాపు లక్ష మంది వరకు ఉన్నారు. వారందరికి సంబంధించిన రుణాలేవీ ఇంతవరకు మాఫీ కాలేదు.


హైదరాబాద్‌లోని గాంధీ భవన ఎదుట నిరసన తెలుపుతున్న రైతు యాదగిరి

నల్లగొండలోనే అత్యధికం

- ఉమ్మడి జిల్లాలో చూస్తే రుణమాఫీ కాని రైతులు నల్లగొండలోనే అత్యధికంగా ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 2024 జూలై 18వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు నాలుగు విడతల్లో 2,33,981 మంది రైతులకు సంబంధించిన రూ.2,004 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. అయితే అందులోనూ డాటా నాట్ ఫౌండ్, బ్యాంకుల నుంచి వివరాలు వ్యవసాయ శాఖకు అందక, బ్యాంకుల పేరు మార్పు వంటి కారణాలతో జిల్లాలో రుణమాఫీ కానీ వారు 15 వేల వరకు ఉండొచ్చని ఒక అంచనా. ఇక రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగిన రైతులు మరో 50 వేల మంది వరకు ఉన్నట్లు తెలిసింది.
- సూర్యాపేట జిల్లాలో నాలుగు విడతల్లో 1,10,359 మంది రైతులకు సంబంధించిన రూ.906.07 కోట్లు మాఫీ అయ్యాయి. వివిధ కారణాలతో మరో 14,599 మంది రైతులకు సంబంధించిన రూ.2 లక్షలలోపు రుణాల మాఫీ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. మరోవైపు 2 లక్షలకు పైబడి రుణాలు ఉన్న రైతులు 30 వేల మంది ఉన్నట్లు అంచనా.

డాటా నాట్ ఫౌండ్, తదితర కారణాలతో..

డీసీసీబీలో రుణాలు తీసుకున్న కొందరు రైతుల వివరాలు వ్యవసాయ శాఖకు అందలేదు. దీంతో వారికి రుణాలు మాఫీ కాలేదు. దానికి తోడు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకుకు చెందిన కొన్ని బ్రాంచీల్లో రుణాలు తీసుకున్న వారి డాటా ఇప్పటికీ నాట్ ఫౌండ్ కిందే ఉంది. దీంతో ఆ రైతులకు సంబంధించిన రూ.లక్షలోపు రుణమాఫీ కూడా కాలేదు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఇటీవల తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారడంతోనూ కొంతమంది రుణమాఫీ పెండింగ్‌లో పడిపోయింది. ఇలా పలు రకాల కారణాలతో రుణాలు మాఫీ కాని రైతులు ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. డాటా నాట్ ఫౌండ్, బ్యాంకు పేరు మార్పుతో పెండింగ్‌లో పడిన వారే కాకుండా రూ.2 లక్షలకు పైగా రుణాలకు సంబంధించిన తదుపరి కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించలేదు.

టీజీబీ రుణాలు మాఫీ కావాల్సి ఉంది



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ).. తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారింది. దీంతో సాంకేతిక సమస్య వచ్చింది. ఆ బ్యాంకులో రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ కావాల్సి ఉంది. అది ప్రభుత్వ పరిశీలనలో ఉంది.
– శ్రావణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

- యాదాద్రి జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణాల మాఫీ కోసం దాదాపు 20 వేల మంది రైతులు ఎదురు చూస్తున్నారు. డాటా నాట్ ఫౌండ్ పేరుతో రుణమాఫీ కాని వారు కూడా ఐదారు వేల మంది ఉండొచ్చని అంచనా.


యాగశాలలో శ్రీస్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న వానమామలై రామానుజ జీయర్ స్వామి

వైభవంగా తిరువీధి సేవ

- తిరు, మాడ వీధుల్లో ఊరేగుతూ యాగశాలకు నృసింహుడు
- మూడవ రోజూ కొనసాగిన పంచకుండాత్మక యాగం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం శ్రీలక్ష్మీ, నృసింహ దేవతా హవనాలు, హోమాలు, మంటప దేవతారాధన, తిరువీధి సేవ, చతుస్థానార్చన పూజలు నిర్వహించారు. అనంతరం పంచ వింశతి కలశ స్నపనంలో భాగంగా 25 కలశాలల్లో పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చెరకు రసం, కొబ్బరి, ఎర్ర చందనం, కుంకుమ, మారపత్రి నీరు, కదళీ, సర్వ ఔషధి, పుష్పోదకం, ఫలోదకం, గంధోదకం, హోమోదకం, రత్నోదకం, పుణ్యోదకం, సరిత్తోయం తదితర పవిత్ర జలాలను కలశాల్లో నింపి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వీటితో 23వ తేదీన స్వర్ణ విమాన గోపురానికి అభిషేకం చేయనున్నారు. అదే విధంగా మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు జరిపించి, నిత్య పూర్ణాహుతి, నివేదన, నీరాజన, మంత్ర పుష్పం, శాత్తుమరై నిర్వహించి తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు.


యాగశాల వద్ద పారాయణం పఠిస్తున్న పారాణికులు

సాయంత్రం చేపట్టిన కార్యక్రమాలు

సాయంత్రం 6గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ద్వారాది కుంభార్చన, చతుస్థానార్చనలు, మూర్తిమంత్ర హోమాలు, ధాన్యాధివాసం నిర్వహించారు. అనంతరం నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి చేసి తిరువీధి సేవను ఆలయంలోకి తీసుకెళ్లారు. శ్రీవానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకల్లో ఈఓ భాస్కర్ రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, రుత్వికులు, పారాయణీకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ తనిఖీలు నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు. రెస్టారెంట్లు, హోటళ్లు, బడ్డీ కోట్లు, తోపుడు బండ్ల వద్ద వాడిన నూనెలను తిరిగి వాడడం, కాల పరిమితి ముగిసిన సరుకుల వాడకం వంటివి జరకుండా చూడాలన్నారు. అలా చేసే హోటళ్లను సీజ్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో కేజీబీవీలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యార్థులు, పేషెంట్లకు భోజనం సరఫరా అవుతుందని.. అక్కడ కూడా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాలను వినియోగించినందుకు ఇప్పటివరకు జిల్లాలో 16 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా అధికారి స్వాతి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డీఏఓ శ్రవణ్‌కుమార్, డీఈఓ భిక్షపతి, ఎస్పీ డీఎస్పీ రమేష్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

27న జాతీయ సైన్స్ పోటీలు

నల్లగొండ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27వ తేదీన సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి భవన్‌లో పోటీలు జరుగుతున్నట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 23వ తేదీలోగా rb.nic.in/rbnilayam ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 28న రాష్ట్రపతి భవన్‌లో బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి 9848578845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

రామగిరి(నల్లగొండ): బాలల హక్కులను పరిరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టులో బాలల హక్కులపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉండకూడదన్నారు. పనిలో నియమించుకునే వారిపై చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖ అధికారులు చట్టాలను వినియోగించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు, ప్యానెల్ న్యాయవాదులు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలకు ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జడ్జిలు సంపూర్ణ ఆనంద్, రోజారమణి, దుర్గాప్రసాద్, కవిత, కులకర్ణి, సౌందర్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్‌రెడ్డి, గిరి లింగయ్య, డిఫెన్స్ న్యాయవాదులు నిమ్మల భీమార్జున్‌రెడ్డి, మిర్యాల లెనిన్‌బాబు, ప్రసాద్, రమణరావు, న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, బ్రహ్మచారి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎం. నాగరాజు

‘భగీరథ’ కార్మికులకు వేతన వెతలు

ఏడు నెలలుగా అందని జీతాలు

- ప్రతినెలా చెల్లించని కాంట్రాక్టర్లు
- అప్పుల పాలై ఆందోళన చెందుతున్న కార్మికులు

నల్లగొండ: మిషన్ భగీరథ పథకంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు అందడం లేదు. సదరు కాంట్రాక్టర్లు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో అందులో పనిచేస్తున్న లైన్‌మెన్లు, ఫిట్టర్లు, ఆపరేటర్లు తమ కుటుంబాలు గడవక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1240 మంది కార్మికులు మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సిబ్బంది నియామకం

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసింది. నదీజలాలను శుద్ధిచేసి ఇంటింటికీ తాగునీరు అందించడం వల్ల ఫ్లోరోసిస్ సమస్య లేకుండా చేయాలని అప్పటి ప్రభుత్వం ఉద్దేశం. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నీటిని శుద్ధిచేసేందుకు మిషన్ భగీరథ పథకం కింద ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఇందులో పనిచేసే సిబ్బంది నియామకానికి మేగా, జీవీపీఆర్, రాఘవ, మల్లారెడ్డి ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థల పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1240 మంది వరకు లైన్‌మెన్లు, ఫిట్టర్లు, ఆపరేటర్లు పనులు చేయిస్తున్నారు. వీరికి ప్రతినెలా వేతనాలు అందించాల్సి ఉండగా ఆయా సంస్థలు ఇష్టారీతిగా చెల్లిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.


మిషన్ భగీరథ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు (ఫైల్)

నెలల తరబడి వేతనాల్లేక..

మిషన్ భగీరథలో ప్రజలకు తాగునీరు అందించే కార్మికులకు కాంట్రాక్టర్లు నెలల తరబడిగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇందులో జీవీపీఆర్ కంపెనీ ఐదు నెలలుగా కార్మికుల వేతనాలు ఇవ్వడం లేదు. మేగా కంపెనీ మాత్రమే ప్రతినెలా వేతనాలు ఇస్తోంది. రాఘవ కంపెనీ మూడు నెలలుగా బకాయి ఉంది. మల్లారెడ్డి ఏజెన్సీ మాత్రం ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిసింది.

ప్రతినెలా వేతనాలు ఇప్పించాలి



నెలల తరబడి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. మాకు నెలకు రూ.10 పదివేల నుంచి రూ.12,500 వరకే వేతనాలు ఇస్తున్నారు. అవికూడా ప్రతి నెలా రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతినెలా వచ్చే విధంగా చూడాలి.
– బత్తుల వెంకటేశం, మిషన్ భగీరథ కార్మికుడు

గతంలో సీమోనా కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ కింద పనిచేసేవారిమని, అప్పట్లో ప్రతినెలా వేతనాలు అందేవని కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ కంపెనీ స్థానంలో వచ్చిన మల్లారెడ్డి ఏజెన్సీ మాత్రం ఏడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. వేతనాల విషయమై కాంట్రాక్టర్లను అడిగినా పట్టించుకోవడం లేదని, దీంతో ఒకపక్క పిల్లల చదువులు, మరో పక్క కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వేతనాలు ఇప్పించాలంటూ కార్మికులు మిషన్ భగీరథ ఎస్‌ఈ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించినా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదంటున్నారు. ఇచ్చేదే అతి తక్కువ వేతనాలని, వాటిని కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టకుండా ప్రతినెలా ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు.

గత ఎమ్మెల్సీలు టీచర్లను విస్మరించారు


సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ : గతంలో పనిచేసిన ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తాను ప్రభుత్వాన్ని ఒప్పించి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో ప్రముఖ పాత్ర పోషించానని.. తానే అసలైన వామపక్షవాదినని పేర్కొన్నారు. శుక్రవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓ ఎమ్మెల్సీ అధికార పార్టీలో చేరి ప్రభుత్వం ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. వామపక్ష బావజాలం పేరుతో వచ్చిన ఎమ్మెల్సీ ప్రశ్నించే గొంతుకనని చెప్పి.. ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీఓను సమర్థించారని విమర్శించారు. నియోజకవర్గానికి మూడుసార్లు ఎన్నికలు జరిగితే ప్రధాన సంఘాల వారే గెలిచారని ఆ నాయకులు ప్రస్తుతం అటుఇటు మారి పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్సీలు ఏం చేశారో ఉపాధ్యాయులు గమనించాలన్నారు. గత ఎన్నికలప్పుడు చేసిన వాగ్దానాలే ప్రస్తుతం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని చెప్పారు. దశాబ్ద కాలంగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడి 18కిపైగా పోలీసు కేసుల అనుభవిస్తున్నానని.. ఉద్యోగం, పెన్షన్ లేకున్నా ఉద్యమిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సీపీఎస్ రద్దు, 317 పరిష్కారం, ఉమ్మడి సర్వీస్ రూల్స్, హెల్త్‌కార్డులు, పెండింగ్ డీఏలు, మంచి పీఆర్‌సీ సాధనే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆలోచించి ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో శంకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనులవిందుగా.. కవలల బంధం

నేడు ప్రపంచ కవలల దినోత్సవం

సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారంటారు. కానీ ఒకే ఇంటిలో ఒకే రూపం కలిగిన ఇద్దరు ఉంటే అది గొప్ప అనుభూతే. శనివారం అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఒకే రూపం కలిగిన కవలలు వీరు..

– నల్లగొండ, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్


రితిక శ్రీ -రిషిక శ్రీ


చరణ్- చరిత్


జయిద్ -రుషాద్


అమాన్ - నుమాన్


కతిన్ - కుందన్


రామయ్య- లక్ష్మయ్య


సాత్విక్ రెడ్డి- సాన్విక రెడ్డి


శ్రీ నిత్య- నిహాస్వి


ఉదయ్ -ఉజ్వల్


ఉజ్వల - అరవింద్


రిషిక -రిషిత్

స్వర్ణగిరి క్షేత్రంలో పల్లకి సేవ


స్వర్ణగిరి క్షేత్రంలోని మాడవీధుల్లో పల్లకి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ మాడవీదుల్లో శుక్రవారం పల్లకి సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో సూర్యప్రభ వాహన సేవ, లక్ష్మీనారాయణ ఇష్ట హవనం, చంద్రప్రభ వాహన సేవ జరిపించారు. సాయంత్రం విష్ణు సహస్ర నామపారాయణం చేశారు. అహోబిలం నుంచి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, చందనాన్ని ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదన్, స్వర్ణగిరి క్షేత్ర దేవాలయం వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు అందజేశారు. అనంతరం వాటిని స్వామి వారికి అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు దంపతులు, ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపి కృష్ణ దంపతులు తోరణ పూజ కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న బాలాజీ

హుజూర్‌నగర్: ఎక్సైజ్ అధికారులకు సహకరిస్తున్నట్లు తన పేరును గ్రామంలో ప్రచారం చేయడంతో మఠంపల్లి మండలం రామచంద్రాపురం తండాకు చెందిన ఆంగోతు బాలాజీ నాయక్ మనస్థాపానికి గురై శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో అతడి బంధువులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. కాగా.. ఈఘటనపై ఎక్సైజ్ సీఐ నాగార్జున రెడ్డిని సంప్రదించగా బాలాజీ కుటుంబ సమస్యల కారణంగానే గడ్డి మందు తాగినట్లు తెలిసిందని తెలిపారు. ఆత్మహత్యాయత్న ఘటనకు, పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న మెడికల్ షాపు వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. మహిళకు సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 87126 70176, 87126 67671 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


సతీష్ (ఫైల్)

చౌటుప్పల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన ఆదిమల్ల సతీష్(23) కుటుంబసభ్యులతో కలిసి జీవనోపాధి నిమిత్తం తూప్రాన్‌పేట గ్రామానికి వచ్చాడు. రోజువారీ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 17న రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం గ్రామం నుంచి నడుచుకుంటూ వస్తుండగా తూప్రాన్‌పేట గ్రామం వద్ద రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దొంగల బీభత్సం

- ఇంటి తాళాలు పగులకొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ


నేరేడుచర్ల మున్సిపాలిటీలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

నేరేడుచర్ల: నేరేడుచర్ల, గరిడేపల్లి, మిర్యాలగూడ, పాలకవీడు మండలాల్లో శుక్రవారం దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని నగదు, ఆభరణాలు చోరీ చేశారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ఐదవ వార్డు నర్సయ్యగూడేనికి చెందిన పేరం వెంకన్న, అతని భార్య లింగమ్మ ఇంటికి తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 2.5 తులాల పుస్తెల తాడు, తులం దిద్దులు, 1.5 తులాల మూడు బంగారు ఉంగరాలు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.6.5 లక్షలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయంపై క్లూస్ టీంకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

సీతారాంపురంలో..

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రషీదాబేగం రోజుమాదిరిగా శుక్రవారం పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులకొట్టి ఉండడంతో ఆందోళన చెందిన ఆమె పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించింది. ఇంట్లో 3.5తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు వివరించింది. దీంతో క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు: మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన గుండ్ర శ్రీనివాసరెడ్డి ఇంట్లో శుక్రవారం బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాసరెడ్డి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. బీరువాలో ఉన్న 12 తులాల వెండి, తులం బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. అదేవిధంగా కల్మేట్‌తండా గ్రామంలో బాణావత్ సైదా వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గర్తించారు. రెండు తులాల బంగారం, రూ.60 వేల నగదు చోరీకి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ


గడ్డిపల్లిలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరేష్

గరిడేపల్లి: మండలంలోని అప్పన్నపేట, గడ్డిపల్లి గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రెండు ఇళ్లలో చోరీ చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పన్నపేట గ్రామానికి చెందిన సోమగాని లక్ష్మి ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 17గ్రాముల బంగారం, 10తులాల వెండి పట్టీలు, రూ. 50వేలు నగదును అపహరించారు. గడ్డిపల్లి గ్రామంలో కర్నం నగేష్ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, కోనం వేణు ఇంట్లో రూ. 36వేల నగదు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపే స్వర్ణగోపురం ఆవిష్కరణ



ఆలయ ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 23న పలు పూజలు రద్దు చేసిన దేవస్థానం అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురాన్ని ఆవిష్కరించి, శ్రీస్వామి వారికి అంకితం ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం రానున్నారు. ఇందుకు సంబంధించి ఆలయాధికారులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొండ పైన మాడ వీధుల్లో తాత్కాలిక షెడ్లు, బారికేడ్ల పనులు చేపట్టారు. సీఎంతోపాటు పలువురు మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు వస్తున్న నేపథ్యంలో ఘాట్ రోడ్డుల్లో ఇరువైపులా ఉన్న వాల్స్‌కు రంగులు వేయడం, శ్రీస్వామి వారి శ్లోకాలను రాస్తున్నారు. ప్రధానాలయం దక్షిణ తిరువీధిలో నుంచి విమాన గోపురానికి సీఎం రేవంత్‌రెడ్డి, వానమామలై రామానుజ జీయర్ స్వామి, మంత్రులు, అర్చకులు వెళ్లే విధంగా నిచ్చెన వంతెన ఏర్పాటు చేస్తున్నారు. కొండ కింద హెలిపాడ్ నిలిపే ప్రదేశంలో ఇనుప గ్రిల్స్ ఏర్పాటు పనులు చేస్తున్నారు.

బ్రేక్ దర్శనాలు రద్దు

బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఈ నెల 23న బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి కొండపైకి ఎలాంటి ప్రైవేట్ వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు. భక్తుల సౌలభ్యం కోసం 25 ఉచిత ఆర్టీసీ బస్సులు నిరంతరంగా కొండపైకి నడపబడుతాయన్నారు. మహోత్సవం పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రసాద కౌంటర్లలో, బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పులిహోర ప్రసాదం ఉచితంగా అందజేస్తామని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.


కొండపైన ఆధ్యాత్మిక రూపాలకు రంగులు వేస్తున్న కూలీలు


ఆలయ ఘాట్‌రోడ్డులో గ్రిల్స్‌కు, వాల్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

వరుసగా నాలుగు వాహనాలను ఢీకొట్టిన కంటైనర్

- అక్కడికక్కడే మృతి చెందిన ద్విచక్ర వాహనదారుడు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి– అద్దంకి బైపాస్ నందిపాడు రోడ్డులో శుక్రవారం అతివేగంగా వెళ్తున్న కంటైనర్ వరుసగా నాలుగు వాహనాలను ఢీ కొట్టింది. ఈఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని శరణ్యగ్రీన్ హోమ్ కి చెందిన పెట్నకోట భరతయ్య(75) యాక్టీవాపై వస్తున్నాడు. ఈక్రమంలో నందిపాడు బైపాస్‌రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కంటైనర్ అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. అనంతరం అదే వేగంతో రోడ్డుపై వెళ్తున్న ఆటోను ఢీ కొట్టి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన మరో రెండు డీసీఎం వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన భరతయ్యను ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ ధనుంజయకు స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న టూ టౌన్ ఎస్ఐ రాంబాబు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

అర్వపల్లి: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గుణగంటి శ్రీను తన గొర్రెలను గురువారం రాత్రి ఇంటి ఆవరణలోని పశువుల దొడ్డిలో తోలాడు. అర్ధరాత్రి దాటాక వీధికుక్కలు గుంపుగా వచ్చి గొర్రెల మందపై దాడి చేశాయి. శుక్రవారం ఉదయం శ్రీను గొర్రెల దొడ్డి వద్దకు వచ్చి చూడగా 12 గొర్రెలు మృతి చెంది ఉన్నాయి. సుమారు రూ. 2లక్షలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

తిప్పర్తి: విద్యుదాఘాతానికి గురై గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన తిప్పర్తి మండలంలోని మర్రిగూడం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింగం భాస్కర్ (50) గొర్రెల కాపరిగా చేస్తున్నాడు. గొర్రెలను మేపడానికి గ్రామంలోని సోమరాజు చెరువు సమీపానికి వెళ్లాడు. గొర్రెల మేత కోసం తుమ్మ చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతున్న క్రమంలో కరెంట్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు.

యువకుడి వద్ద గంజాయి లభ్యం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఓ యువకుడి వద్ద గంజాయి లభ్యమైంది. శుక్రవారం చౌటుప్పల్ బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. దండుమల్కాపురానికి చెందిన యువకుడు(20) బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అతడిని ప్రశ్నించగా గంజాయి విషయం వెలుగుచూసింది. తనిఖీ చేయగా అతడి జేబులో 80గ్రాముల గంజాయి లభించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు కాళ్లతో జన్మించిన కోడిపిల్ల



పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం గ్రామంలో శుక్రవారం నాలుగు కాళ్లతో కోడి పిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన కూన్‌రెడ్డి నారాయణరెడ్డి–జయమ్మ దంపతులు ఇంటిలో కోళ్లను పెంచుతున్నారు. అందులో ఒక కోడిని పొదుగేయడంతో శుక్రవారం పది పిల్లలు గుడ్లనుంచి బయటకు వచ్చాయి. అందులో ఒక కోడిపిల్ల నాలుగు కాళ్లతో జన్మించింది. ప్రస్తుతం నాలుగు కాళ్లతో మిగితా కోడిపిల్లల్లాగే తల్లి కోడి వెంట తిరుగుతుంది.

ఇంటి డాబాపై నుంచి పడి యువకుడు మృతి

హుజూర్‌నగర్: ఇంటి డాబాపై నుండి పడి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లికి చెందిన తుమ్మలపల్లి సాయిరాం (33) సినీపరిశ్రమలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని వనస్థలిపురం చిత్రసీమ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం తన స్నేహితుడు నరేష్‌తో కలిసి మిర్యాలగూడలోని తన మామ సామనూరి నాగరాజు ఇంటికి వెళ్లి రాత్రి హుజూర్‌నగర్‌కు వచ్చాడు. రాత్రి సమయంలో పట్టణంలోని నరేశ్ బావ అయిన ఓరుగంటి శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. ఇరువురు కలిసి ఇంటి డాబా ఎక్కి మద్యం తాగుతుండగా.. సాయిరాం ప్రమాదవశాత్తు డాబాపై నుంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో మృతిచెందాడు. కాగా.. తన కుమారుడి మరణంపై అనుమానం ఉందని తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ నందిని(40) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని నాగోల్‌లో నివాసం ఉంటూ బ్యూటీషియన్‌గా చేస్తోంది. ఆమె భర్త సత్యనారాయణతో కలిసి బంధువుల గ్రామమైన వలిగొండ మండలం గొల్నేపల్లిలో జరుగుతున్న ముత్యాలమ్మతల్లి పండుగకు హాజరయ్యేందుకుగాను శుక్రవారం ఉదయం బైక్‌పై వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్‌రోడ్డు దాటగానే విజయవాడ వైపు నుంచి అతివేగంగా వచ్చిన కంటైనర్ లారీ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో నందిని తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఉపాధ్యాయులు మందలించారని..

- ఇంటి నుంచి పారిపోయి వచ్చిన విద్యార్థులు
- యాదగిరిగుట్టలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగింత

యాదగిరిగుట్ట రూరల్: స్కూల్‌లో టీచర్లు మందలించడంతో నలుగురు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి పోలీసులకు చిక్కారు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో పటేల్‌నగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు అజ్మద్, హర్షవర్ధన్, తేజ్ నాథ్, నితీష్ కుమార్‌లు 8వ తరగతి చదువుతున్నారు. ఈక్రమంలో పాఠశాలలో టీచర్లు ప్రతి రోజు తమను కావాలని తిడుతున్నారని మనస్థాపానికి గురయ్యారు. ఈ నెల 19న సాయంత్రం తల్లిదండ్రులకు చెప్పకుండా హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి వరంగల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి యాదగిరిగుట్ట ప్రాంతానికి గురువారం సాయంత్రం చేరుకున్నారు. దాతర్‌పల్లి గ్రామ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నలుగురు విద్యార్థులు అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదైందని తెలుసుకున్న పోలీసులు, హుటాహుటిన వెళ్లి, వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేశారు. తాము హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చామని విద్యార్థులు పోలీసులకు తెలిపారు. ఈ విషయమై హైదరాబాద్ అంబర్‌పేట పోలీసులకు తెలపగా.. తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. యాదగిరిగుట్ట పోలీసులు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ నందాపురం శివారులోని పురాతన ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. బుధవారం రాత్రి పోలీసులు ఇసుక రవాణాను అడ్డుకోవడానికి పెట్రోలింగ్‌కు వెళ్తుండగా పురాతన ఆలయ స్థలంలో తవ్వకాలు జరుపుతుండటంతో వారిని ప్రశ్నించి అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు గురువారం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నికోలస్ తెలిపారు.

చోరీకి యత్నించి పోలీసులకు పట్టుబడి..

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో వట్టి దేవేందర్‌రెడ్డి ఇంట్లో బుధవారం దొంగతనానికి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. చౌటుప్పల్ మండలానికి చెందిన యువకుడు దొంగతనం జరిగిన ఇంటి పక్కనే మరో ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం దేవేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఇంటి ముందు జరుగుతున్న మున్సిపాలిటీ నీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తుండగా వెనుక వైపు నుంచి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న 5తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ప్రస్తుతం నింధితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం

చెప్పులు అరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు

- పంట రుణమాఫీకాక.. సన్న ధాన్యం బోనస్ అందక అవస్థలు పడుతున్నాను
- విసిగి వేసారే గాంధీభవన్ మెట్లపై ధర్నా చేపట్టాను
- 'సాక్షి'తో రైతు తోట యాదగిరి ఆవేదన


తోట యాదగిరి

శాలిగౌరారం: పంట రుణమాఫీ కోసం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకు చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా.. నేటికి రుణమాఫీ జరుగలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో 2024 నవంబర్‌లో 54.80 క్వింటాళ్ల సన్నధాన్యం అమ్మాను.. సన్నధాన్యం బోనస్ నేటికీ మా ఖాతాలో జమ కాలేదు.. అటు రుణమాఫీ జరుగక.. ఇటు సన్న ధాన్యం బోనస్ అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నా. విధిలేక చివరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్ మెట్లపై కూర్చొని ధర్నా చేసి నిరసన తెలిపాను అని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన రైతు తోట యాదగిరి చెప్పాడు. తోట యాదగిరికి భార్యతో పాటు కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. యాదగిరి కుటుంబానికి గ్రామంలో 6.24 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2016లో యాదగిరితో పాటు అతని భార్య ప్రమీల పేరున శాలిగౌరారం ఎస్‌బీఐ బ్రాంచిలో పంట రుణం తీసుకున్నారు. ప్రభుత్వం రుణమాఫీ పథకం ప్రవేశపెట్టే నాటికి యాదగిరి పేరున రూ.208505, అతని భార్య ప్రమీల పేరున రూ.95367 కలిపి మొత్తం రూ.303872లు బ్యాంకు రుణంగా ఉంది. వారికి నేటికి రుణమాఫీ జరుగలేదు. ఇదిలా ఉండగా 2024 నవంబర్‌లో మండలంలోని చిత్తలూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో అతని కుమారుడు తోట సుధాకర్ పేరున 54.80 క్వింటాళ్ళ సన్న ధాన్యం విక్రయించాడు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకారం యాదగిరి కుటుంబానికి రూ.27400 అందాలి కానీ, అందలేదని అందుకే గాంధీభవన్ వద్ద ధర్నా చేశానని వివరించాడు.

సన్న ధాన్యం బోనస్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ

పంట రుణమాఫీ జరగలేదని, సన్నధాన్యం బోనస్ అందలేదని శుక్రవారం గాంధీభవన్ ఎదుట ధర్నా చేపట్టిన అంబారిపేట గ్రామానికి చెందిన రైతు తోట యాదగిరి సంఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. సాయంత్రానికి రూ.27400 సన్నధాన్యం బోనస్ తన బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు యాదగిరి తెలిపాడు.